క్లుప్తంగా

'జగదేక సుందరి సామ'కు అవార్డులు



ఉత్తమ జ్యూరీ అవార్డు అందుకుంటున్న దర్శకుడు పత్తి ఓబులయ్య

కర్నూలు కల్చరల్: తిరుపతిలో అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారి 'జగదేక సుందరి సామ' పద్య నాటకానికి జాతీయ స్థాయి అవార్డులు లభించారు. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం అవార్డుల వివరాలను వెల్లడించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన నాటకానికి ఉత్తమ జ్యూరీ అవార్డుతో పాటు ఉత్తమ నాయకురాలు అవార్డు సురభి ప్రభావతికి, ఉత్తమ హాస్య నటి అవార్డు హసీనాకు, ఉత్తమ ఆహార్యం అవార్డు శ్రీనివాసులుకు లభించాయి. అవార్డులు పొందిన కళాకారులను పత్తి ఓబులయ్య, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

డ్రగ్స్ ఆరోగ్యానికి హానికరం



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఈగల్ సిబ్బంది, విద్యార్థులు

కర్నూలు: మాదక ద్రవ్యాలతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఈగల్ సెల్ సమన్వయకర్త, ఎస్ఐ సుజన్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో కర్నూలు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ సుజన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై డ్రగ్స్ వినియోగం వల్ల తలెత్తే ఆర్థిక, అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సమాజంలో మాదక ద్రవ్యాల ప్రభావం ఎంత నష్టం కలిగిస్తుందో వివరించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే తీసుకునే చర్యలను వివరించారు. డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే 1972 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వీసీ ప్రసాద్ రెడ్డి, డీన్ అక్తర్‌బాను, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఏఐ సెంటర్ ఏర్పాటు



ఏఐ సెంటర్ ఏర్పాటు పత్రాలను చూపుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి

కర్నూలు (సిటీ): స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థులు (1993–1997) రాఘవేంద్ర, రమేష్ సహకారంతో 'గ్లోబల్ ఏఐ కాంపిటెన్స్ సెంటర్'ను సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధిలో పాలు పంచుకోవడం సంతోషకరమన్నారు. కళాశాల ఉద్యోగ కల్పనాధికారి డాక్టర్ కె.గోవర్ధన్ రెడ్డి కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను వివరించారు. గ్లోబల్ ఏఐ కాంపిటెన్స్ సెంటర్ సీఈఓ రాఘవేంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులకు కృత్రిమ మేధస్సు అప్లికేషన్లు చేయించి ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. వివిధ విభాగాధిపతులు, డీన్‌లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వైభవంగా గోదా దేవి జయంతి



ప్రత్యేక అలంకరణలో గోదా దేవి

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో సోమవారం గోదా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. గోదా దేవి అమ్మవారికి అష్టోత్తర శత కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పట్టు వస్త్రాలను సమర్పించారు. తోమాల సేవ నిర్వహించి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. వడి బియ్యం, సారె సమర్పించారు. ఊంజల్ సేవ, తిరుమాడ వీధుల్లో అమ్మవారికి గజవాహన సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో మామిళ్ల పల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో గోదా అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, తిరుప్పావై సేవ, పల్లకి సేవ నిర్వహించారు. లలితా పీఠం వ్యవస్థాపకు మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

- అన్ని వర్గాలను మోసం చేసిన సీఎం చంద్రబాబు
- వచ్చే కార్పొరేషన్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలి
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పోస్టర్ల ఆవిష్కరణ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూఆర్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

కర్నూలు (టౌన్): ఏడాదిలోపే కూటమి ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. అధికారం కోసం ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో కర్నూలు నగరంలోని 42 నుంచి 52 వార్డుల వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు గతేడాది ఎన్నికల సమయంలో 'మీ భవిష్యత్తుకు నేను గ్యారెంటీ' అంటూ సభల్లో హామీలు గుప్పించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కన్నా రెండింతలు సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెప్పారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు ఇస్తామని, ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ.1500, అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు, అలాగే 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రతి నెలా రూ.4 వేలు పెన్షన్, నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తానని హామీలు గుప్పించారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 13 నెలలు దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, ఇది ప్రజలను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు.

కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ విజయ మనోహరి మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం మహిళలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అయితే చంద్రబాబు ఎప్పట్లాగే వారందరినీ మోసం చేశారన్నారు. అధికారం కోసం అబద్ధాలు చెప్పిన చంద్రబాబు ప్రభుత్వంపై పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, 50 ఏళ్లకు పింఛన్, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏడాది దాటినా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని నిలదీశారు. త్వరలో కర్నూలు కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయని, 2019 నాటి ఫలితాలు పునరావృతం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరిద్దామని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా ఇప్పటి నుంచే కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం అవుదామని పిలుపునిచ్చారు. పార్టీ మహిళా విభాగం నాయకులు కల్లా నాగవేణి రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మునెమ్మ, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, క్రిష్ణకాంత్, శ్రీనివాసరావు, పార్టీ నాయకులు షరీఫ్, రాఘవేంద్ర, పార్టీ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

కర్నూలు కల్చరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమ వారం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు పరిపూర్ణ అధ్యయన సాధనంతో పూర్తిగా మాట్లాడే పాకెట్ లైబ్రరీ (డైసీ మెషిన్)ను కలెక్టర్ అందజేశారు. విద్యార్థులు డైసీ మెషిన్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

హెపటైటిస్‌పై అవగాహన

కర్నూలు సిటీ: అంతర్జాతీయ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం ప్రభుత్వ డైట్ కాలేజీలో ఛాత్రోపాధ్యాయులకు ఆ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఆయూబ్ హుసేన్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డాక్టర్ చెంగ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హెపటైటిస్ కాలేయ సంబంధిత వ్యాధి అని చికిత్స చేయించుకోకుంటే దీర్ఘకాలిక వ్యాధిగా మారుతుందన్నారు. దీని వల్ల లివర్ సిర్రోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. డైట్ సీనియర్ అధ్యాపకులు ఎం.గోవిందు, సైన్స్ సీనియర్ అధ్యాపకులు వి.సురేష్, సైన్స్ అధ్యాపకులు వి.కరుణానిధిమూర్తి, వై.వనం రాజు, నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు తొలగించండి



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని 35వ వార్డు గోవర్ధన్ నగర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని సీఎంఎం ప్రతినిధులు అక్బర్ బాష, లక్ష్మమ్మ విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని ప్రజల ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన 23 అర్జీలను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునీద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మీ టీపీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➤ 39వ వార్డు స్టాంటన్‌పురంలో మురుగు నీరు నేరుగా కేసీ కెనాల్‌లో కలవడం వల్ల అపరిశుభ్ర వాతవరణం ఏర్పడుతోందని ఆర్‌పీఎస్ఎఫ్ ప్రతినిధులు లక్ష్మీ ప్రశాంత్, దివాకర్ వివరించారు.

➤ 12వ వార్డు వడ్డెగేరిలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ప్రతినిధులు వేణుగోపాల్, మన్సూర్, సంజన్న కోరారు.

➤ ఎఫ్‌సీఐ కాలనీ–1, శ్రీశైల దేవస్థాన ఉద్యోగుల కాలనీలో డ్రైనేజీ కాల్వలు, రహదారులు నిర్మించాలని స్థానికులు వెంకటరాముడు, మద్దిలేటి అభ్యర్థించారు.

➤ సాయి గణేష్ నగర్, మారుతి గ్రీన్ సిటీ ప్రాంతాల్లో రహదారిని నిర్మించాలని స్థానికులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసులు కోరారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

కర్నూలు కల్చరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం కర్నూలు నగరంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు వీఆర్ కాలనీలో పర్యటన, 7.30 నుంచి 8 గంటల వరకు ఎస్టీబీసీ కళాశాల సమీపంలోని క్లబ్ క్యాంటీన్ వద్ద ఛాయ్ పే చర్చ, ఉదయం 10.30 నుంచి 11.15 గంటల వరకు ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల సమర్పణ, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంట వరకు బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, సాయంత్రం 4.30 గంటలకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

ఏపీ ఎన్‌జీఓ నేత వెంగళ్‌రెడ్డిపై నేడు విచారణ

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డిపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణమ్మ మంగళ వారం విచారణ జరపనున్నారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్‌లో ఉపాధ్యక్షుడిగా ఉన్న సాంబ శివారెడ్డి పలు ఆరోపణలతో వెంగళ్ రెడ్డిపై జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వో వెంగళ్ రెడ్డికి ఇటీవల నోటీసులు కూడా జారీ చేశారు. ఇందులో భాగంగా మంగళ వారం విచారణకు హాజరుకావాలని డీఆర్వో ఆదేశించినట్లు సమాచారం.

హెపటైటిస్‌తో క్యాన్సర్ ముప్పు



వైద్య విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): హెపటైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే క్రమంగా క్యాన్సర్‌కు దారి తీస్తుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. ఆస్పత్రిలోని ఓల్డ్ లెక్చరర్ హాల్‌లో సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం పురస్కరించుకుని కేఎంసీ ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు 300 మందికి ఉచితంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తీవ్రమైన కాలేయ వ్యాధి, క్యాన్సర్‌కు కారణమయ్యే కాలేయం వాపు, వైరల్ హెపటైటిస్ గురించి వైద్యులు అవగాహన పెంచుకోవాలన్నారు. వైద్య విద్యార్థులకు రెండో డోస్ వ్యాక్సిన్‌ను నెల రోజుల తర్వాత ఇస్తారన్నారు. కేఎంసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ మాట్లాడుతూ.. హెపటైటిస్ వ్యాధి గురించి వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, ఎస్పీఎం హెచ్ఓడీ డాక్టర్ సుధాకుమారి, కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సింధియా శుభప్రద, గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్ఓడీ డాక్టర్ జి.మోహన్‌రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన పెంచుకోవాలి

హెపటైటిస్ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. గాయత్రి ఎస్టేట్‌లోని ఆయన క్లినిక్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. హెపటైటిస్ ఏ, ఈ ఇన్‌ఫెక్షన్లు వాటంతటవే తగ్గిపోతాయని, బీ, సీ వైరస్‌లు మాత్రం ప్రమాదకరమైనవని వివరించారు. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్ సోకకుండా చూసుకోవచ్చన్నారు

షూటింగ్ బాల్ పోటీల్లో సత్తా చాటాలి



విజేత జట్టును అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి సూచించారు. స్థానిక విఠల్ నగర్‌లోని గుడ్ షప్పర్డ్ క్రీడా మైదానంలో సోమవారం జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు మాట్లాడుతూ.. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 14 బాలుర జట్లు, 9 బాలికల జట్లు పాల్గొన్నాయన్నారు. బాలుర విభాగంలో విజేతగా ఆశ్రమ పాఠశాల (తాండ్రపాడు), సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (ద్వితీయ స్థానం, చిన్నటేకూరు), తృతీయ స్థానంలో గుడ్ షప్పర్డ్ పాఠశాల (విఠల్ నగర్, కర్నూలు), బాలికల విభాగంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, పత్తికొండ (మొదటి స్థానం), సాంఘిక సంక్షేమం బాలికల గురుకుల పాఠశాల (కంబాలపాడు, ద్వితీయ స్థానం), సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల (వెల్దుర్తి, తృతీయ స్థానం) సాధించాయి. విజేతలకు మెడల్స్, కప్పులు అందజేశారు. గుడ్‌షపర్డ్ విద్యాసంస్థల అధినేత మిన్నెల, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, రాఘవేంద్ర, సుభాన్ బాష తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఎన్నికల్లో ఆదామ్, భాగ్యరాజా గెలుపు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని చిల్డ్రన్స్ పార్కు ఎదురుగా ఉన్న ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చి పోస్ట్రేట్–1లో కమిటీ సభ్యుల ఎన్నికల్లో ఆదామ్, భాగ్యరాజా అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో 1300 ఓట్లు ఉండగా 1000 ఓట్లు పోలయ్యాయి. ఆదామ్, రాజారావు ప్యానళ్లు పోటీ పడ్డాయి. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఓటింగ్ జరిగింది. పాస్టర్లు, సంఘ సభ్యులు కలిసి ఓట్ల లెక్కింపు నిర్వహించారు. తెల్లవారుజామున పాస్టర్ వరప్రసాద్‌రావు గెలుపొందిన సభ్యుల పేర్లను ప్రకటించారు. ఆదామ్, భాగ్యరాజా ప్యానల్‌లో పోటీ చేసిన 20 మంది సభ్యులందరూ గెలుపొందారు. రాజారావు ప్యానల్‌లో సభ్యులందరూ ఓటమి చవి చూశారు. గెలుపొందిన ఆదామ్ ప్యానల్ కొత్త సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు మూడేళ్ల పాటు కమిటీ సభ్యులుగా కొనసాగుతారని వారు స్పష్టం చేశారు.

హెడ్ నర్సుకు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజీ విభాగంలో హెడ్ నర్సుగా పనిచేస్తున్న వసంతకుమారి ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను కార్డియాలజీ విభాగంలో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ సన్మానించారు. ఆమె తన 38 ఏళ్ల సర్వీసులో 30 ఏళ్లు కార్డియాలజీ విభాగంలో సేవలందించారని కొనియాడారు. కార్డియాలజీ వైద్యులు ప్రశాంత్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు పీ–4 విధానం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కల్చరల్: పేదరిక నిర్మూలనకు పీ – 4 విధానం అమలు చేస్తున్నారని, ఇందులో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో పీ – 4 విధానం అమలుపై విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో భాగస్వామ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం పుణ్యకార్యమని ఈ అవకాశం పీ – 4 విధానంతో లభిస్తోందన్నారు. ఇప్పటి వరకు 22 వేల కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. పీ – 4 పాలసీకి సంబంధించి సందేహాలుంటే కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో 94407 58201, 94411 74933 నంబర్లను సంప్రదించాలన్నారు. జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు సహకారం



కేఎంసీ పూర్వ విద్యార్థులతో చర్చిస్తున్న వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న నాలెడ్జ్ సెంటర్‌కు తన వంతు సహకారం అందిస్తానని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆయన సోమ వారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశమయ్యారు. సెప్టెంబర్‌లో నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి పునాది వేయనున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ సెంటర్ వైద్యులకే గాక వైద్య విద్యార్థులకు సైతం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కళాశాలలోని వివిధ విభాగాలకు అవసరమైన వసతులు, సౌకర్యాలపై చర్చించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల అభివృద్ధికి సహకారం

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. ఆయన సోమవారం నర్సింగ్ కాలేజీని సందర్శించి ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ, విద్యార్థులతో మాట్లాడారు. బీఎస్సీ, నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్ విద్యార్థులు రీసెర్చ్ విభాగంలో ముందుకొస్తే నిధులు కేటాయిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.పద్మావతి, అధ్యాపకులు, ట్యూటర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల ప్రైవేటుపరం తగదు



ఆందోళన చేస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

కర్నూలు సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. ఆర్టీసీ విలువైన స్థలాలను కాపాడాలని కోరుతూ సోమవారం ఆర్టీసీ బస్ డిపోల ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీకి ఎంతో విలువైన స్థలాలు ఉన్నాయని, ప్రభుత్వం వాటిని ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. విజయవాడ నడిబొడ్డున వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే గవర్నర్ పేట డిపో–2 స్థలాన్ని లులూ కంపెనీకి అప్పగించడం దుర్మార్గమైన చర్య అని, తక్షణమే ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ స్టేషన్ల కోసం ప్రైవేటు సంస్థలకు ఆర్టీసీ స్థలాలను అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 వేల ఎకరాల ఆర్టీసీ స్థలాలను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఎస్.డబ్ల్యూ.ఎఫ్ రీజనల్ కార్యదర్శి కె.సి శేఖర్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్.డబ్ల్యూ.ఎఫ్) జిల్లా అధ్యక్షుడు హనుమంతురెడ్డి, కర్నూలు–1 డిపో కార్యదర్శి నాగరాజు, కర్నూలు–2 డిపో కార్యదర్శి సి.బజారి తదితరులు పాల్గొన్నారు.



స్వామిరెడ్డి నగర్‌లో నాగ ప్రతిమలకు పూజలు



మెడికల్ కాలేజీ గ్రౌండ్ వద్ద పుట్టకు పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు



వడ్డెగేరిలో..



హంద్రీ నది పక్కన ఉన్న నాగుల పుట్ట పూజలు

నాగమయ్యా.. దీవించయ్యా

జిల్లా వ్యాప్తంగా సోమవారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లోని నాగమయ్య కట్టలకు, పుట్టలకు నువ్వుల పిండి, కొబ్బెర బెల్లం నైవేద్యంగా సమర్పించి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరులు నాగుల కట్టల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

– కర్నూలు కల్చరల్/సాక్షి ఫొటోగ్రాఫర్



లలితా పీఠంలో నాగమయ్యకు పాలు పోస్తున్న భక్తులు



సత్యనారాయణ స్వామి ఆలయంలో..

సారా వ్యాపారం మానేస్తే ప్రత్యామ్నాయ ఉపాధి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ చంద్రహాస్

కర్నూలు: నాటుసారా తయారీ, విక్రయాన్ని వదిలేస్తే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్ చెప్పారు. నవోదయం 2.0లో భాగంగా సోమవారం కర్నూలు బంగారుపేట కాలనీలో నాటుసారా తయారీదారులు, కాలనీవాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. సారా తయారీదారులు, విక్రయదారులు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలతో జీవనం సాగించాలని సూచించారు. ఏయే రంగాల్లో ప్రావీణ్యం ఉందో ఆ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెప్మా అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాంటి వారి వివరాలను సేకరించారు. ఇంకా ఎవరైనా ఉంటే ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చి పేర్లు నమోదు చేయించుకోవాలని, వారి వివరాలను మెప్మా అధికారులకు పంపించి సత్వర ఉపాధి మార్గాన్ని ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎక్సైజ్ ఎస్ఐ రెహనా బేగం, మెప్మా మేనేజర్ భాస్కర్ రెడ్డి, సాంకేతిక అధికారి జిలానీ, డీఆర్‌డీఏ స్కిల్ డెవలప్‌మెంట్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సమస్యలు పరిష్కరించాలి



సమగ్ర శిక్ష ఏడీ ప్రసన్నకుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐసా నాయకులు

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు సోమవారం సమగ్ర శిక్ష అడిషనల్ డైరెక్టర్ ప్రసన్నకుమార్‌ను అమరావతిలో కలిసి వినతి పత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ.. పేద, నిరుపేద విద్యార్థులు కేజీబీవీల్లో సీట్లు పొందడం కష్టంగా మారిందన్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు అధికంగా వలస వెళుతుంటారని, వారు తమ పిల్లలను కేజీబీవీల్లో చేర్పించేందుకు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు. అలాంటి వారికి సీట్లు రాకపోతే చదువును మాన్పించి తమ వెంట వలసలకు తీసుకపోతున్నారన్నారు. కేజీబీవీల్లో సీట్లు పెంచాలని, నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యమైన సరుకులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్, మహేష్, శీను, తదితరులు పాల్గొన్నారు.